E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 23-05-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:140|| పేజీలు–6
www.ekaburu.com

తీవ్ర సంక్షోభంలో పంట కొనుగోళ్లు

- రైతుల ఆత్మహత్యలపై సర్కారు బుకాయింపు
- ధాన్యం సేకరణపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ముఖ్యమంత్రి అండదండలు ఉండడంతోనే పోక్సో నిందితుడిని తొలుత అరెస్టు చేయలేదు: కేటీఆర్

నిప్పుల వేసవి
పెరుగుతున్న వడగాలుల విపత్తు!

ఏటికేడు ప్రమాదకరంగా మారుతున్న ఎండలు
ప్రస్తుతం దేశంలో అసాధారణ వాతావరణ మార్పులు
పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయ పెరుగుదల
మార్చి నుంచే వడగాలులు
'క్లైమామీటర్' సంస్థ అధ్యయనం

మిగతా 2లో

రూ. 100 కోట్ల తిమింగలం!

- ఏసీబీకి చిక్కిన మల్కాజిగిరి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్
- 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు.. అనంతరం అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- ప్రభుత్వ భూముల్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంలో ఘనుడు
- ప్రతిగా రూ.వంద కోట్లకు పైగా అయాచిత లబ్ధి పొందినట్లు అంచనా

02

24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఈ-కబురు: జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఈసీ తెలిపింది. జూన్ 1న నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ. 9న

తల్లిదండ్రులు ఐఏఎస్ అధికారులైతే.. పిల్లలకు రిజర్వేషన్ ఎందుకు?

సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
ఇలా కొనసాగిస్తే దాన్నుంచి ఎన్నటికీ బయటపడలేమని వ్యాఖ్య

03

ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు
బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

02



హీట్ వేవ్ పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

ఈ-కబురు,అమరావతి, మే 22:

రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు, వడ గాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్ వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడ గాలుల నుంచి ఎలా రక్షించు కోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

మిగతా 3లో

రైతులు ఇబ్బంది పడుతున్నా.. సిఎం పట్టించుకోవటం లేదు

రెండున్నరేళ్లుగా వ్యవసాయశాఖ పై కనీసం రివ్యూ చేయలేదు
ధాన్యం కొనకుండా, తరుగు పేరుతో రైతులకు అన్యాయం
తక్షణమే ప్రభుత్వం స్పందించాలి. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరిక
సచివాలయం వద్ద ధర్నా, అరెస్ట్ చేసిన పోలీసులు

ఈ-కబురు, ,హైదరాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అత్యంత దుర్మార్గపూరితంగా వ్యవహరిస్తుందంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం కారణంగా వరి కుప్పలపైన రైతులు చనిపోతున్నారని, ఆ సంఘటనలు చూస్తుంటే బాధనిపిస్తుందన్నారు. రైతులు పండించిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, తరుగు పేరుతో అన్యాయం చేయవద్దంటూ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. టీఆర్ఎస్, శ్రేణులు, మహిళలు, రైతులు ఈ ధర్నా లో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రైతులు ఎంత ఇబ్బంది పడుతున్న సరే ఈ ముఖ్యమంత్రి పట్టించుకోవటం లేదన్నారు.

02

రైతు గోస.. బీజేపీ భరోసా

- అన్నదాతల సమస్యలపై 25 నుంచి పోరు..
- నితిన్ నబీన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు
- 'బ్రేక్ ఫాస్ట్' సమావేశంలో పార్టీ నేతల కార్యాచరణ ప్రణాళిక
- మాట్లాడుతున్న రామచందర్‌రావు. చిత్రంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అభయ్ పాటిల్

02

వ్యూహాత్మక భాగస్వామ్యస్థాయికి భారత్–సైప్రస్‌ల బంధం

02

భారీ విజయం సాధించినా సన్‌రైజర్స్‌కు నిరాశే

పాపం సన్‌రైజర్స్ హైదరాబాద్.. కొండంత స్కోరు చేసింది.. అద్భుత ఫామ్‌లో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును మట్టికరిపించింది.. కానీ అనుకున్నది మాత్రం దక్కలేదు. క్వాలిఫయర్-1 బెర్తును కొద్దిలో చేజార్చుకున్న సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్‌లో భాగంగా ఎలిమినేటర్ ఆడకతప్పదు.

06

తీవ్ర సంక్షోభంలో పంట కొనుగోళ్లు

ఈ కబురు, హైదరాబాద్:
రాష్ట్రంలో పంట కొనుగోళ్ల సంక్షోభం తీవ్రంగా ఉంటే.. దాన్ని పట్టించుకోకుండా ముఖ్యమంత్రి తోపాటు మంత్రులంతా అవాస్తవాలు మాట్లాడుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రైతన్నల ఆత్మహత్యలు, మరణాలపై ప్రభుత్వం బుకాయిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా చేసిన పంట కొనుగోళ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''రాష్ట్రవ్యాప్తంగా రైతులు స్వచ్ఛందంగా రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే.. కనీసం కాంటా వేయడం లేదు. ఈ విషయంలో ప్రతి అంశంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ముఖ్యమంత్రేమో.. 80 శాతం పంట కొనుగోళ్లు పూర్తయ్యాయని చెబుతున్నారు. మంత్రేమో 50 శాతం అయ్యాయంటున్నారు. క్షేత్రస్థాయిలో 30 శాతం కొనుగోళ్లు కూడా పూర్తి కాలేదు'' అని కేటీఆర్ పేర్కొన్నారు. ''ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని బయటకు వస్తే.. ఆ అమ్మాయి కుటుంబంపైనే 'హనీ ట్రాప్' అంటూ కౌంటర్ కేసు పెట్టి కుట్ర చేయించింది ఎవరో విచారణ జరిపించాలి. కేవలం కేంద్ర మంత్రి కుమారుడు కావడం.. ముఖ్యమంత్రి అండదండలు ఉండడంతోనే తొలుత అరెస్టు చేయలేదు. తనకు అన్యాయం జరిగిందని బాలిక.. తల్లిదండ్రులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే.. తీవ్ర ఆవేదనకు గురిచేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదా? ఈ 9 రోజుల్లో బెయిల్ కోసం నిందితుడు అన్ని ప్రయత్నాలు చేసి.. చివరకు హైకోర్టు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తే.. దిక్కులేని పరిస్థితుల్లోనే నిందితుడిని అరెస్టు చేశారు. బండి సంజయ్‌తో నాకు ఎలాంటి వ్యక్తిగత పంచాయితీ లేదు. ఆయన నా తండ్రి గురించి అడ్డగోలుగా మాట్లాడినా.. నేను స్పందించలేదు. పోక్సో కేసు విషయంలో జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తే.. మా బావమరిది ఇంటిపై డ్రగ్స్ దాడి జరిగిందంటూ సంబంధం లేకుండా సీఎం మాట్లాడుతున్నారు. అలాంటిదేమైనా ఉంటే.. కేసుఎందుకు పెట్టడంలేదు?'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

గల్ఫ్ వెళ్లిన వారి ఓటు హక్కును కాపాడతాం

జీవనోపాధి కోసం గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లిన రాష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు కార్యాచరణ చేపడతామని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని ప్రశాంత్‌రెడ్డి నివాసంలో ఉమ్మడి నిజామాబాద్ భారాస నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. 'సర్' నేపథ్యంలో ఇతర దేశాలకు వెళ్లిన వారు ఆందోళన చెందుతున్నారని నేతలు చెప్పడంతో కేటీఆర్ ఈ మేరకు స్పందించారు.

రైతు గోస.. బీజేపీ భరోసా

ఈ కబురు, హైదరాబాద్:
పండించిన ధాన్యం అమ్ముకోలేక రైతులు కల్లాల్లోనే పడిగాపులు కాస్తున్నారని.. వారి పక్షాన పోరాడేందుకు బీజేపీ రాష్ట్ర విభాగం నిర్ణయించిందని పార్టీ నేతలు వెల్లడించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు నేతృత్వంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు 'బ్రేక్ ఫాస్ట్' సమావేశంలో పాల్గొన్నారు. భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అనంతరం పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ''రాష్ట్రంలో కర్షకుల సమస్యలపై పోరాడేందుకు 'రైతు గోస.. బీజేపీ భరోసా' పేరుతో ఈ నెల 25 నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో మూడు రోజులపాటు కార్యక్రమం కొనసాగుతుంది. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులంతా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులో రైతుల వద్దకు వెళ్లి వారి పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారు. ఇంతవరకు 24 శాతం ధాన్యమే కొనుగోలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మక్కలు, జొన్నలు పెద్దఎత్తున కొనుగోలు చేయాల్సి ఉంది. సీఎం రేవంత్ రైతులకు హామీలిచ్చి పట్టించుకోవడం లేదు'' అని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

'సర్'పై అవగాహన కల్పించాలి..
సమావేశంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్)పైనా చర్చ జరిగింది. 'సర్'పై కాంగ్రెస్ నేతలు లేనిపోని అనుమానాలు రేకెత్తిస్తున్నారని, వీటిపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించేందుకు బీజేపీ నేతలు కృషి చేయాలని రామచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో చాలామందికి రెండు మూడు ఓట్లున్నాయని... అలాంటి వాటిని గుర్తించి ఏరివేసే కార్యక్రమమే 'సర్' అని అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ జూన్ మొదటివారంలో రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నేతలు నిర్ణయించారు. తెలంగాణలో అధికారం చేపట్టడమే లక్ష్యమని ప్రధాని దిశానిర్దేశం చేశారని.. ఇందుకు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి.. నితిన్ నబీన్ సమక్షంలో వెల్లడించాలని చర్చించారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, ఎంపీలు రఘునందన్, అర్వింద్, మండలి పక్ష నేత ఏవీఎన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

వ్యూహాత్మక భాగస్వామ్యస్థాయికి భారత్-సైప్రస్‌ల బంధం

ఈ కబురు, దిల్లీ:
భారత్ సైప్రస్‌లు తమ అనుబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాయి. మౌలిక సదుపాయాలు, షిప్పింగ్ తదితర రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించాయి. ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల చర్యల్లో భాగంగా సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడూలిడెస్ భారత సందర్శనకు విచ్చేసిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఆయనకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఇరువురు నేతలూ పశ్చిమాసియా సంక్షోభంతోపాటు ఉక్రెయిన్ యుద్ధంపై సైతం చర్చలు జరిపారు. ''గడచిన దశాబ్ద కాలంలో సైప్రస్ నుంచి భారత్‌లోకి వస్తున్న పెట్టుబడులు దాదాపు రెండింతలు పెరిగాయి. ఇరుదేశాల మధ్య విశ్వాసం పెంపొందింది. భారతయూరప్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో అనేక కొత్త అవకాశాలకు మార్గం ఏర్పడింది'' అని ప్రధానమంత్రి మోదీ ఈ సందర్భంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలోనే ఈ పెట్టుబడులు మరో రెండింతలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం, అని మోదీ తెలిపారు. ఈ నిశ్చయానికి కార్యరూపం ఇవ్వడంలో భాగంగానే ఈరోజు ఇరుదేశాల మధ్య నెలకొన్న విశ్వాసపూరిత సంబంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్తున్నామని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచ వ్యవస్థల్ని సంస్కరించే విషయంలో భారతసైప్రస్‌లు ఏకాభిప్రాయం కలిగివున్నాయి అని ఆయన అన్నారు. సముద్రయాన భద్రత, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు వంటి రంగాలకు సహకారాన్ని విస్తరించాలని ఇరు దేశాలూ నిర్ణయించాయని ప్రధాని తెలిపారు.

నిప్పుల వేసవి.. పెరుగుతున్న వడగాలుల విపత్తు!



ఈకబురు,హైదరాబాద్: దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాలుల తీవ్రత ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోంది. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల కన్నా ఎక్కువగా నమోదుకావడంతో వడగాలుల సంక్షోభం నెలకొంది. రాత్రివేళల్లో కనీస ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలకు దగ్గరగా నమోదవుతున్నాయి. నగరాల్లో అర్బన్‌హీట్ ఐలాండ్ ప్రభావం(నగరాల్లో వేడి నిలిచిపోవడం) కూడా తీవ్రంకావడంతో భూమిలో తేమశాతం పడిపోతోంది. మానవ తప్పిదాలు, శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడటంతో వాతావరణ మార్పులతో భూతాపం పెరుగుతోంది. ఇందుకు ఎల్‌నినో ఒక్కటే ప్రధాన కారణం కాదని, ప్రాంతీయ వాతావరణ మార్పులు, మానవ తప్పిదాలే ప్రధాన కారణమని 'క్లైమామీటర్' సంస్థ స్పష్టంచేస్తోంది. భవిష్యత్తులో వేసవికాలం మరింత సుదీర్ఘంగా, తీవ్రంగా వచ్చే అవకాశాలున్నాయని, దీనివల్ల తీవ్రంగా నష్టపోయే దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉంటుందని హెచ్చరిస్తోంది. భారత్‌లో వేసవి పరిస్థితులు, ఏప్రిల్ నెలలో అధిక ఉష్ణోగ్రతలపై ఈ సంస్థ అధ్యయనం చేసి తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు వివరించింది.

వడగాలుల ముప్పు తీవ్రమవుతోంది
ఆసియాలో కొన్నేళ్లుగా భూఉపరితలానికి దగ్గరగా ఉండే గాలి ఉష్ణోగ్రత నిరంతరం పెరుగుతోంది. దీంతో వడగాలుల ముప్పు తీవ్రమవుతోంది. హిందూ మహాసముద్రంలో వేడి వాతావరణం పెరగడంతో ఏర్పడే ఎల్‌నినో కారణంగా వడగాలుల సంఖ్య, వాటి వ్యవధి అధికమవుతోంది. దేశంలో రాత్రి ఉష్ణోగ్రతలు సగటున ప్రతి దశాబ్దానికి 0.21 డిగ్రీలు పెరుగుతోంది. దశాబ్దకాలంలోగాలిలో తేమ 67.1 నుంచి 71.2 శాతానికి చేరింది. అర్బన్ హీట్ ఐలాండ్ తీవ్రత 2నుంచి 10 డిగ్రీల వరకు అధికంగా ఉంటోంది. రుతుపవనాల ఆలస్యంతో ఆహారధరలు, ద్రవ్యోల్బణం 5% పెరిగే ప్రమాదముంది.
అధిక ఉష్ణోగ్రత తీవ్రతతో దేశంలో 4.3 కోట్ల మంది ప్రజలు, 341.12 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతోంది.

ప్రస్తుతం ఎడారి మీదుగా గాలులు
రాజస్థాన్, పంజాబ్, హరియాణా ఎడారి ప్రాంతాల నుంచి మధ్య భారత్‌కు నిరంతరంగా వీస్తున్న వేడి గాలులతో ప్రస్తుతం తీవ్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివాస, ఆరోగ్య మార్గదర్శకాల ప్రకారం.. నిద్రపోతున్న సమయంలో గుండెపై ఒత్తిడి పడకుండా, నరాల బలహీనతలు లేకుండా, ఉష్ణోగ్రత సంబంధ ఆరోగ్య సమస్యలు రావొద్దంటే గది ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలకన్నా ఎక్కువ ఉండకూడదు. రాత్రివేళల్లో 30 డిగ్రీలకు మించి నమోదవుతుండటం ప్రమాదాన్ని సూచిస్తోంది.

ఏప్రిల్‌లో 2 డిగ్రీలు అదనం
గత ఏప్రిల్‌లో సాధారణంతో పోల్చితే ఉష్ణోగ్రత 2 డిగ్రీలు అధికంగా ఉంది. ఈ ఏడాది మార్చి నెలాఖరు నుంచే ఉత్తరాదిలో తీవ్ర వడగాలుల ప్రభావం ప్రారంభమైంది. ఏప్రిల్ 2428 మధ్య ఉత్తరాది, మధ్య, పశ్చిమ భారత్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. యూపీలోని బాందాలో ఏప్రిల్ 27న అత్యధికంగా 47.6 డిగ్రీలు నమోదైంది. గంగానది మైదాన ప్రాంతాలైన లఖ్‌నవూ, ఇతర నగరాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలతో అత్యవసర హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈఏడాది వడగాలులు అసాధారణమైనవిగా నిలిచిపోనున్నాయి.తెలంగాణలో గత దశాబ్దంలో సగటు రాత్రి ఉష్ణోగ్రత పెరుగుదల 0.8 డిగ్రీలుగా ఉంది. గాలిలో తేమ పెరుగుదల 6.8 శాతంగా ఉంది. అత్యధికంగా దిల్లీలో ఈ పెరుగుదల 8 డిగ్రీలుగా ఉంటే.. తెలంగాణ నాలుగో స్థానంలో ఉంది.

రూ. 100 కోట్ల తిమింగలం!

ఈకబురు, హైదరాబాద్: వంద కోట్ల రూపాయల అవినీతి క్లబ్‌లో మరో అక్రమార్కుడు చేరాడు. ప్రభుత్వ భూముల్ని ప్రైవేటుపరం చేసి అక్రమ సంపాదనతో రూ.కోట్లు కూడబెట్టి ఎట్టకేలకు అవినీతి నిరోధక శాఖకు చిక్కాడు. మేడ్చల్‌మల్కాజిగిరి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్(అర్బన్ ల్యాండ్ సీలింగ్ విభాగం) మర్రి వంశీ మోహన్‌పై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయమే ఏసీబీ బృందాలు హైదరాబాద్ వనస్థలిపురం ఎన్‌జీవో కాలనీలోని ఆయన ఇల్లు, మేడ్చల్‌లోని యూఎల్‌సీ కార్యాలయంతోపాటు సన్నిహితులు, బంధువులు, బినామీలకు చెందిన 11 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. గుంటూరులోని అతడి మామ ఇంట్లోనూ సోదాలు జరిగాయి. సోదాల్లో మొత్తం రూ.6.22 కోట్ల (రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం) విలువైన ఆస్తుల్ని గుర్తించారు. వీటిలో సుమారు రూ.5.68 కోట్ల విలువైన స్థిరాస్తులే. బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ రూ.వంద కోట్లపైమాటే అని అంచనా వేస్తున్నారు.సోదాల అనంతరం వంశీమోహన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా అక్రమాలపై ఆరా
వంశీమోహన్ 201923 మధ్య కాలంలో శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా పనిచేశాడు. ఈ మండలంలో విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు కట్టబెట్టడంలో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. శేరిలింగంపల్లి, మియాపూర్, గుట్టలబేగంపేట్, మాదాపూర్, ఖానామెట్, గచ్చిబౌలి, గోపన్‌పల్లి, హఫీజ్‌పేట్ తదితర ప్రాంతాల్లోని రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వభూములు వివాదాలలో ఉండగా.. ఓవైపు కోర్టు కేసులు నడుస్తుండగానే మరోవైపు ప్రైవేటు వ్యక్తులు ఈ భూముల్లో పాగా వేశారు. ఓ కలెక్టర్‌తో కలిసి వారికి సహకరించడం ద్వారా వంశీమోహన్ పెద్దఎత్తున అయాచిత లబ్ధి పొందినట్లు ఆరోపణలున్నాయి.

పిగ్లీపూర్ భూవివాదం.. రికార్డుల స్వాధీనం
అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం రాత్రివరకు సోదాలు నిర్వహించారు. సెలవులో ఉన్న అక్కడి తహసీల్దార్‌ను రప్పించి మరీ రికార్డుల్ని పరిశీలించారు. మండలంలోని పిగ్లీపూర్ గ్రామం సర్వే నంబరు 17లోని 8 ఎకరాల వివాదాస్పద వ్యవసాయ భూముల లావాదేవీల గురించి ఆరా తీశారు. రికార్డుల్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ భూములపై ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తుల మధ్య ఎప్పటినుంచో వివాదం నడుస్తుండగా.. ఆ భూముల్ని వంశీమోహన్ తెలివిగా కాజేసినట్లు ఆరోపణలున్నాయి. 2023లో ఆ భూముల్ని అతడి మామ విజయ్‌భాస్కర్ కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు రికార్డుల్ని స్వాధీనం చేసుకున్నారు. తొలుత తన మామ పేరిట భూముల్ని రిజిస్ట్రేషన్ చేయించిన అతడు.. స్థిరాస్తి సంస్థకు అప్పగించినట్లు అధికారులు భావిస్తున్నారు. అందుకు ప్రతిగా వంశీ మోహన్ స్థిరాస్తిసంస్థ ఏర్పాటు చేసిన వెంచర్‌లో 10 ప్లాట్లను పొందినట్లు వస్తున్న ఆరోపణలపై ఏసీబీ ఆరా తీస్తోంది.

రెండేళ్లుగా వంశీమోహన్ పారాహుషార్
ఎప్పటికైనా ఏసీబీ తనపై దృష్టి సారిస్తుందని వంశీమోహన్ ముందే ఊహించినట్లు కనిపిస్తోంది. సోదాలలో పెద్దగా విలువైన పత్రాలేవీ లభించకపోవడాన్ని బట్టి ఈ విషయం అవగతమవుతోంది. వనస్థలిపురంలో ప్రస్తుతం అతడు ఉంటున్న ఇంట్లో దానికి సంబంధించిన పత్రాలు సైతం లేకపోవడాన్ని బట్టి అధికారులు ఈ అంచనాకు వస్తున్నారు. అతడికి చెందిన 2 లాకర్లను గుర్తించి తనిఖీ చేశారు. తండ్రి విశ్రాంత ఉద్యోగి కాగా.. వంశీమోహన్ ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్నారు. లాకర్లలో చూస్తే కనీస బంగారు ఆభరణాలు సైతం లేవు. దీన్నిబట్టి వంశీమోహన్ ఏసీబీ దాడి జరుగుతుందనే అనుమానంతోనే పక్కా ప్రణాళికతో వ్యవహరించినట్లు భావిస్తున్నారు. అందుకే గడిచిన రెండేళ్లుగా ఎలాంటి లావాదేవీలకు ఆస్కారం లేకుండా జాగ్రత్త పడినట్లు ఏసీబీ అధికారులు అంచనాకొస్తున్నారు.

ఏసీబీ గుర్తించిన ఆస్తులు ఇలా..
రూ.4,46,28,000 విలువైన 19 ఓపెన్‌ప్లాట్లు
వనస్థలిపురం ఎన్‌జీవో కాలనీలో ఇల్లు
మణికొండలో 1,000 చదరపుఅడుగుల ఫ్లాట్
హైటెక్‌సిటీ ప్రాంతంలోని మసీదుబండలో 2,000 చదరపు అడుగల ఫ్లాట్
ఇబ్రహీంపట్నం మండలం నర్రెపల్లిలో 2 ఎకరాల్లో ఫామ్‌హౌస్
రూ.2,10,800 నగదు
బ్యాంకు ఖాతాలో రూ.20 లక్షలు
122 గ్రాముల బంగారు ఆభరణాలు
రూ.32 లక్షల విలువైన ఇన్నోవా క్రిస్టా, కియా కార్లు

ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

ఈ కబురు తెలంగాణ :
సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవం పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మాజ్యోతి రావు పూలే ప్రజా భవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 20147 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని ఆయన చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు మరియు అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయం అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమంఅభివృద్ధి రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి (Solar Power) విభాగంలోస్థిరమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మరియు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి (GSDP), ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు. ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పెద్ద కల. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2% గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7% తో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం

₹2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం ₹4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉప ముఖ్యమంత్రి గర్వంగా ప్రకటించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకుని ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు.మహిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

గోపనపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో పర్యటించిన రాగం హరిశంకర్ యాదవ్


స్థానికులతో కలిసి జలమండలి అధికారులతో రాగం హరిశంకర్ యాదవ్ సమావేశం

గోపనపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో పర్యటిస్తున్న హరి శంకర్ యాదవ్

త్రాగునీటి సమస్య పరిష్కరించాలని జలమండలి అధికారులకు వినతి

ఈకబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గోపనపల్లి వికర్ సెక్షన్ కాలనీలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం హరిశంకర్ యాదవ్ శుక్రవారం స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి వికార్‌సెక్షన్ ప్రాంతంలో ప్రజలు తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న రాగం హరి శంకర్ యాదవ్ శుక్రవారం స్థానికులు, గోపన్ పల్లి నాయకులతో కలిసి బస్తీని సందర్శించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా తెలుసుకొని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక ప్రజలతో కలిసి జలమండలి కార్యాలయానికి వెళ్లి ఇద్దరు మేనేజర్లను కలిసి గోపన్‌పల్లి వికార్‌సెక్షన్ ప్రాంతంలో నెలకొన్న నీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత నివారణ చర్యల కోసం పనులు చేపట్టాలని సూచించారు. ఈ విషయమై స్పందించిన జలమండలి మేనేజర్లు సంబంధిత అధికారులను పిలిపించి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల స్పందన పై హర్షం వ్యక్తం చేసిన స్థానికులు వీకర్ సెక్షన్ కాలనీ సమస్యల పరిష్కారం కోసం ముందుకు వచ్చిన హరి శంకర్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శంకరి రాజు ముదిరాజ్, ఎండ్ల రాణి, ప్రభు, లక్ష్మయ్య, నర్సింహ, అఫ్జల్ ఖాన్, ఎస్. మురుగేష్, వెంకటేశ్వర్లు, పెద్దరాజు, శ్రీను, శ్రీకాంత్, సుగుణ, సరిత తదితరులు పాల్గొన్నారు.

24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఈ-కబురు,: జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఈసీ తెలిపింది. జూన్ 1న నోటిఫికేషన్, నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ. 9న నామినేషన్ల పరిశీలన. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 11 వరకు గడువు తేదీగా ఈసీ ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుంది. జూన్ 20 కల్లా ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

ఏపీలో నాలుగు స్థానాలకు..

ఏపీ నుంచి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్‌ల పదవీ కాలం జూన్ 26న ముగియనుంది. దీంతో ఏపీలోని నాలుగు స్థానాలకు జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి.

హోటల్ లో మండీ బిర్యానీ తిని యువకులకు అస్వస్థత

అంజయ్య నగర్ లో సంఘటన చోటుచేసుకున్న హోటల్

హోటల్ ముందు ఆంజనేయులు సాగర్ తో పాటు స్థానికుల ఆందోళన

- పాడైన ఆహార పదార్థాల కారణంగా ఫుడ్ పాయిజన్
- అంజయ్య నగర్ అన్నపూర్ణ హోటల్ లో ఘటన
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హోటల్ పై చర్యలు తీసుకోవాలి : ఆంజనేయులు సాగర్

ఈకబురు, శేరిలింగంపల్లి : సరదాగా స్నేహితులు, కుటుంబ సభ్యులతో భోజనం చేసేందుకు వచ్చే వారికి కొన్ని హోటళ్లు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. పాడైపోయిన ఆహార పదార్థాలు నిల్వ ఉంచిన మాంసాహారాలతో వంటకాలు చేసి వడ్డిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షణ కొరబడటంతో హోటళ్లలో భోజనం ప్రజలను ఆసుపత్రుల పాలు చేస్తుంది. తాజాగా గచ్చిబౌలి పరిధిలోని అంజయ్య నగర్ లో గల అన్నపూర్ణ హోటల్ లో మండీ బిర్యానీ తిన్న ఐదుగురు యువకులు ఫుడ్ పాయిజన్ కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

గచ్చిబౌలి పరిధిలోని అంజయ్య నగర్ లో ఉన్న అన్నపూర్ణ హోటల్‌లో స్థానిక యువకులు శివ శ్రీకాంత్. గణేష్. రోహిత్, మరో యువకుడు కలిసి మండీ బిర్యానీ తిన్నారు. కొద్దిసేపటికే యువకులు తీవ్ర ఫుడ్ పాయిజనింగ్‌కు గురై విపరీతమైన వాంతులు, అస్వస్థత గురయ్యారు. దీనితో కుటుంబ సభ్యులు వారిని ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం యువకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పాడైపోయిన చికెన్, గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉపయోగించడం కారణంగానే ఈ సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ సంఘటన స్థలికి చేరుకొని హోటల్ ను పరిశీలించారు. దీంతోపాటు అస్వస్థతకు గురైన యువకులను పరామర్శించారు. అనంతరం ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఇటువంటి హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంజయ్యనగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న అన్ని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లలో సైతం ప్రత్యేక ఫుడ్ ఇన్స్పెక్షన్ నిర్వహించి, నాణ్యతలేని మరియు గడువు ముగిసిన ఆహార పదార్థాలు వాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. సంఘటన అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారులకు పిర్యాదు చేస్తే కనీస స్పందన లేదని వాపోయారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకముందే అధికారులు స్పందించి హోటలలో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. యువకులను పరామర్శించిన వారిలో అంజయ్య నగర్ కాలనీ ప్రెసిడెంట్ నరసింహసాగర్, ఆంధ్ర శీను, కృష్ణ సాగర్, రవి సాగర్, సీతారాం సాగర్, వేలాద్రి, రాజు, తిరుపతయ్య సాగర్, గణేష్, రోహిత్ తదితరులు ఉన్నారు.

హీట్ వేవ్ పై రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

పచ్చదనం పెంపుపై దృష్టి

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని.. ఈ ఏడాదిలోనూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదు అయినట్టు అధికారులు వివరించారు. గడచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే... పచ్చదనం పెరుగుతుందని... తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమన లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రైతులు ఇబ్బంది పడుతున్నా.. సిఎం పట్టించుకోవటం లేదు

రెండున్నరేళ్లుగా వ్యవసాయ శాఖ పై కనీసం రివ్యూ చేయలేదని మండిపడ్డారు. ధర్నాకు దిగిన కవిత గారితో సహా రైతులు, మహిళలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. మహిళలు, రైతులు అని కూడా చూడకుండా ఓవరాక్షన్ చేశారు. కవిత గారిని అరెస్ట్ చేసి ఫలక్ నుమా స్టేషన్ కు తరలించి అనంతరం విడుదల చేశారు.

వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా రైతులు వరి కుప్పలపై చనిపోతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని కవిత ప్రశ్నించారు. రైతుల దుఖం మామూలుగా లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 48 డిగ్రీల ఎండలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతుంటే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. అత్యంత కర్కోటక, అమానవీయ ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. కనీసం రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని చేతగాని దద్దమ్మ సర్కార్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలనే తాము సచివాలయం ఎదుట వడ్లు పోసి నిరసన తెలిపామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేయకపోగా తరుగు పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకే గ్రేడ్ ఏ ధాన్యాన్ని గ్రేడ్ బీ అని రిజిస్టర్ చేస్తున్నారని చెప్పారు. కలెక్టర్లు కూడా రైతులకు అన్యాయం చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఇక నైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోని రైతుల సమస్యలను పట్టించుకోవాలన్నారు. లేదంటే రేపటి నుంచి అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు సహా అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలన్నారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని, రైతుల గోసను ముఖ్యమంత్రి పట్టించుకోవాలని సూచించారు. దళారుల చేతిలో మోసం పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి వ్యవసాయ శాఖ మీద రివ్యూ చేసి రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు.

తల్లిదండ్రులు ఐఏఎస్ అధికారులైతే.. పిల్లలకు రిజర్వేషన్ ఎందుకు?

ఈ కబురు, దిల్లీ:
రిజర్వేషన్ల ద్వారా విద్య, ఆర్థిక పరమైన పురోగతి సాధించిన కుటుంబాలకు చెందిన పిల్లలు ఓబీసీ రిజర్వేషన్ ఫలాలను కోరడంలో ఔచిత్యాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రిజర్వేషన్ల నుంచి ఎన్నటికీ బయటపడలేమని వ్యాఖ్యానించింది. ''తల్లిదండ్రులిద్దరూ ఐఏఎస్ అధికారులైతే.. వారి పిల్లలకు రిజర్వేషన్ ఎందుకు? విద్య, ఆర్థిక పరమైన సాధికారతతో వారు సామాజిక గతిశీలత (సోషల్ మొబిలిటీ) సాధించారు. మళ్లీ వారి పిల్లలకు కూడా రిజర్వేషన్ కోరితే.. దీన్నుంచి మనం ఎప్పటికీ బయటపడలేం'' అని జస్టిస్ బి.వి.నాగరత్న వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులిద్దరూ కర్ణాటక ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో.. క్రీమీ లేయర్ ఆధారంగా తనకు రిజర్వేషన్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ నిర్వహించింది. ''ఇది ఆందోళనకర విషయం. ఇలా కొనసాగిస్తూ పోతే ప్రయోజనమేంటి? రిజర్వేషన్ ద్వారా తల్లిదండ్రులు చదువుకున్నారు. మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. అయినా పిల్లలు మళ్లీ రిజర్వేషన్ కోరుతున్నారు. వారు దీన్నుంచి బయటపడాలి'' అనిజస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

సామాజిక హోదా మెరుగవుతుంది కదా..

కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా పురోగతి సాధించినప్పటికీ రిజర్వేషన్ ఫలాలు కొనసాగుతుండటంపై జస్టిస్ నాగరత్న విచారణ సందర్భంగా పదేపదే ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక, విద్యాపరమైన సాధికారతతో సామాజిక హోదా మెరుగవుతుందని గుర్తుచేశారు. తల్లిదండ్రులు చదువుకొని, మంచి ఉద్యోగాలు చేస్తూ, చాలినంత ఆదాయాన్ని కలిగి ఉన్నప్పటికీ.. పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలు వర్తింపజేయడం వెనుక హేతుబద్ధతను ఆమె ప్రశ్నించారు. ''ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్), డిసడ్వాంటేజ్డ్ గ్రూప్‌నకు సామాజిక వెనుకబాటు అనేది లేదు. ఆర్థిక వెనుకబాటుతనం మాత్రమే ఉంది. ఈ విషయంలో కొంత సమతుల్యత అవసరం. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినవారైతే పర్లేదు. కానీ రిజర్వేషన్లతో లబ్ధి పొంది తల్లిదండ్రులు ఒక స్థాయికి వచ్చాక కూడా.. పిల్లలకు రిజర్వేషన్లను మినహాయించడాన్ని ప్రశ్నిస్తే ఎలా?'' అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

కేసు నేపథ్యం ఇదీ..

కురుబ సామాజిక వర్గం కర్ణాటకలో వెనుకబడిన తరగతుల (బీసీ) కేటగిరీ 2(ఎ)లో ఉంది. ఈ వర్గానికి చెందిన ఓ అభ్యర్థి కర్ణాటక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీటీసీఎల్)లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే కుటుంబ వార్షిక ఆదాయం రూ.19.48 లక్షలుగా ఉండటంతో..

రోబో... అభిమన్యు

ఈ కబురు ; కావడానికి అది మరమనిషే కావొచ్చు.. పట్టుదల, అంకితభావం, నిబద్ధత విషయంలో మనిషికి ఏమాత్రం తీసిపోదు! ఈ రోబో సైనికుడు మొక్కవోని దీక్షతో కదనరంగంలో పోరాడింది. ఏకంగా 45 రోజుల పాటు రష్యా భీకర దాడులను తిప్పికొట్టింది. తద్వారా కీలక భూభాగం ప్రత్యర్థి చేతికి చిక్కకుండా చూసింది. ఈ రోబో పేరు డ్రాయిడ్ టీడబ్ల్యూ 12.7. ఉక్రెయిన్‌కు చెందిన డెవ్‌డ్రాయిడ్ అనే కంపెనీ దీన్ని తయారుచేసింది. ఈ మరమనిషి చేతిలో బ్రౌనింగ్ ఎం2 లార్ క్యాలిబర్ మెషీన్ గన్ ఉంటుంది. ఉక్రెయిన్ సైన్యంలోని 3వ ఆర్మీ కోర్‌లో ఇది భాగం. ఒక పదాతిదళ బృందం స్థానంలో.. కీలక భూభాగాన్ని రష్యా దాడుల నుంచి రక్షించే బాధ్యతను ఈ రోబో స్వీకరించింది. ఉక్రెయిన్‌లో పూర్తి రోబోటిక్ ఆపరేషన్ ఇదే. ఈ మరమనిషిని 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆపరేటర్ నియంత్రిస్తాడు. కదనరంగంలో డ్రోన్లు ప్రత్యర్థి కదలికలపై నిఘా పెట్టి.. రోబోకు నిరంతరం సమాచారం చేరవేశాయి. ముప్పు గురించి నిర్ధారించుకున్నాక.. ఆపరేటర్ సూచనల మేరకు ఈ రోబో తన మెషీన్ గన్‌తో శత్రువుపై కాల్పులు జరిపేది. చొరబాటుకు రష్యా సైన్యం చేసిన ప్రతి ప్రయత్నాన్నీ తిప్పికొట్టింది. ఉక్రెయిన్ సైనికులకు ప్రాణనష్టం లేకుండా చూసింది. నిత్యం సరిహద్దుకు చేరువలోకి వెళ్లి, రష్యా బలగాల కదలికలను ఈ రోబో గమనించేది. అవసరమైతే కాల్పులు జరిపేది. సాయంత్రానికి రహస్య ప్రదేశానికి వెళ్లిపోయేది. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో దాదాపు 80 శాతం మేర తరలింపు పనులను ఉక్రెయిన్ భూతల రోబోలు నిర్వర్తిస్తున్నాయి. శత్రు శిబిరాల్లోకి పేలుడు పదార్థాలను చేరవేయడం, గాయపడిన ఉక్రెయిన్ సైనికులను వెనక్కి తీసుకురావడం వంటివి చేస్తున్నాయి. ఒక్కొక్కటి 10వేల నుంచి 30 వేల డాలర్లు పలికే ఈ మరమనుషులు త్వరలో కదనరంగాన మరిన్ని బాధ్యతలను తీసుకునే అవకాశం ఉంది.

ఎస్‌బీఐ ఉద్యోగుల సమ్మె వాయిదా

దిల్లీ: మే 25, 26 తేదీల్లో ఎస్‌బీఐ ఉద్యోగులు తలపెట్టిన సమ్మె వాయిదా పడింది. దీంతో ఆ రోజుల్లో బ్యాంక్ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. ఈమేరకు ఎస్‌బీఐ ప్రకటన విడుదల చేసింది. సరైన సంఖ్యలో ఉద్యోగులు, మెసెంజర్లు, సాయుధ గార్డుల నియామకంతో పాటు ఎన్‌పీఎస్ ఉద్యోగులకు పెన్షన్ ఫండ్ మేనేజర్ ఎంపికను మార్చడం వంటి వాటిని చేపట్టాలని ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ (AISBISF) డిమాండ్ చేసింది. ఈక్రమంలోనే సమ్మెకు పిలుపునిచ్చింది. తాజాగా ఇది వాయిదా పడిందని ఎస్‌బీఐ ప్రకటించింది.

హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్ విడుదల.. ధర రూ.12 లక్షలు

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ హోండా కార్స్ ఇండియా తన పాపులర్ హైబ్రిడ్ సెడాన్ హోండా సిటీ 2026ని లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధరను రూ.11.99 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. మిడ్‌సైజ్ సెగ్మెంట్‌లో ఫోక్స్‌వ్యాగన్ వర్టస్, స్కోడా స్లావియా, హ్యుందాయ్ వెర్నాకు గట్టి పోటీ ఇవ్వనుంది. హోండా సిటీతో పాటు జడ్ఆర్‌వి ఎస్‌యూవీని ఆవిష్కరించింది.హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్‌లో ముందు భాగాన్ని పూర్తిగా మార్చేసింది. హనీకూంబ్ తరహాలో ఫ్రంట్ గ్రిల్, లైట్‌తో కూడడిన స్ట్రిప్ ఇచ్చారు. ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేతో కూడిన 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఇచ్చారు. సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్, ఫ్రంట్ వెంటిలేటెడ్, 8 స్పీకర్ సిస్టమ్, యాంబియెంట్ లైటింగ్, ఫుట్‌వీల్ లైటింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. 360 డిగ్రీ కెమెరా, ఆరు ఎయిర్ బ్యాగులు, హిల్‌హోల్డ్ అసిస్ట్, ADAS ఫీచర్లు ఉన్నాయి. ఈ కారులో 1.5 లీటర్ నాచురల్ యాస్పిరేటెడ్ ఇంజిన్ 121hp పవర్‌ను, 145Nm పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిక్స్ స్పీడ్ మాన్యువల్ లేదా సీవీటీ గేర్ బాక్స్‌తో వస్తోంది.2030 నాటికి 10 కొత్త మోడళ్లు: భారత మార్కెట్‌లో 2030 నాటికి ఎలక్ట్రిక్, కాంపాక్ట్ ఎస్‌యూవీ సహా 10 కొత్త మోడళ్లను లాంచ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హోండా ఇండియా వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో పూర్తి ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేయనున్నట్లు తెలిపింది.

శాంతి ఒప్పందంపై ఆశలు.. లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్లు లాభపడ్డాయి. దేశీయంగా రూపాయి విలువ బలపడడం, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఓ దశలో 600 పాయింట్లకు పైగా లాభాల్లో ట్రేడైన సెన్సెక్స్.. చివరికి మోస్తరు లాభాలకే పరిమితమైంది. నిఫ్టీ 23,700 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 75,260.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,183.36) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,810.97 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 231.99 పాయింట్ల లాభంతో 75,415.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 64.60 పాయింట్ల లాభంతో 23,719.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 63 పైసలు బలపడి 95.73కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, ఐటీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 105.07 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4532 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

గెయిల్ లాభం రూ.1,262 కోట్లు

దిల్లీ: ప్రభుత్వ రంగ గ్యాస్ యుటిలిటీ సంస్థ గెయిల్ ఇండియా, మార్చి త్రైమాసికంలో రూ.1,262.18 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 202425 ఇదే కాల లాభం రూ.2,049.03 కోట్లతో పోలిస్తే ఇది 38% తక్కువ. కార్యకలాపాల ఆదాయం స్వల్పంగా తగ్గి రూ.34,797 కోట్లకు పరిమితమైంది. సహజ వాయువు మార్కెటింగ్ నష్టాలు రూ.151.32 కోట్లు, పెట్రోరసాయనాల విభాగం నష్టాలు రూ.377.71 కోట్లకు చేరాయి. గ్యాస్ సరఫరా వ్యాపార ఆదాయం 48% పెరిగి రూ.1,881.58 కోట్లకు చేరింది. 202526 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గెయిల్ నికర లాభం రూ.6,968 కోట్లకు తగ్గింది. 202425లో ఇది రూ.11,312 కోట్లుగా నమోదైంది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు 50 పైసల చొప్పున తుది డివిడెండు చెల్లించేందుకు కంపెనీ బోర్డు సిఫారసు చేసింది.

ఒక్కో షేరుకు ₹506 డివిడెండ్.. రికార్డు తేదీ ఇదే

టెక్నాలజీ, సైన్స్ కంపెనీ 3M ఇండియా త్రైమాసిక ఫలితాలను, వాటాదారులకు డివిడెండ్‌ను ప్రకటించింది. తుది డివిడెండ్ కింద రూ.160, స్పెషల్ డివిడెండ్ కింద రూ.346 కలిపి చెల్లించనున్నట్లు తెలిపింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు అర్హులైన వాటాదారులకు మొత్తంగా రూ.506 చొప్పున డివిడెండ్ చెల్లించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు జులై 17ను రికార్డు తేదీగా ప్రకటించింది. ఆ తేదీ నాటికి కంపెనీ షేర్లు కలిగిన వాటాదారులకు డివిడెండ్ చెల్లించనుంది. ఆగస్టులో నిర్వహించే 39వ వార్షిక సాధారణ సమావేశంలో వాటాదారుల ఆమోదానికి లోబడి ఈ చెల్లింపులు ఉంటాయి. ఏజీఎం పూర్తయిన 30 రోజుల్లో చెల్లింపులు జరుగుతాయని తెలిపింది.3ఎం ఇండియా ఈ స్థాయిలో డివిడెండ్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. 2025 జులైలో స్పెషల్ డివిడెండ్, ఫైనల్ డివిడెండ్ కలిపి రూ.535 వాటాదారులకు చెల్లించింది. అంతకుముందు ఏడాది రూ.685 ప్రకటించింది. 2023 జులైలో 100 డివిడెండ్ చెల్లించిన ఈ కంపెనీ.. 2022 నవంబర్‌లో స్పెషల్ డివిడెండ్ కింద రూ.850 వాటాదారులకు వేసింది. ఇప్పటి వరకు ఒక్కో షేరుకు రూ.2,170 చొప్పున డివిడెండ్ రూపంలో ఈ కంపెనీ చెల్లించడం గమనార్హం. జనవరి మార్చి త్రైమాసికానికి ప్రకటించిన ఫలితాల్లో రూ.215 కోట్ల నికర లాభాన్ని, రూ.1399 కోట్ల ఆదాయాన్ని ఈ కంపెనీ నమోదు చేసింది.

--ఏమిటీ కంపెనీ?

3ఎం ఇండియా లిమిటెడ్ అనేది అమెరికాకు చెందిన ప్రముఖ గ్లోబల్ మల్టీనేషనల్ టెక్నాలజీ సంస్థ 3M కంపెనీ అనుబంధ సంస్థ. సైన్స్, ఇన్నోవేషన్ ఆధారంగా వైవిధ్యమైన ఉత్పత్తులను ఈ సంస్థ తయారు చేస్తుంటుంది. స్క్రాచ్‌బ్రైట్ పేరుతో స్క్రబ్‌లు, మాప్‌లు; కమాండ్ హుక్స్, ఆఫీసు స్టేషనరీకి సంబంధించి ఉత్పత్తులను ఈ సంస్థ తయారు చేస్తుంటుంది. శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి 3ఎం షేరు విలువ 3 శాతం పెరిగి రూ.33,185 వద్ద ముగిసింది. గడిచిన వారంలో 6 శాతం పెరగ్గా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 8 శాతం మేర క్షీణించింది.

కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌బీఐ బంపర్ డివిడెండ్

ముంబయి: కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) గుడ్‌న్యూస్ చెప్పింది. 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది.ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములుకమీషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లురుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలుపింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.

ఏ ఏడాది ఎంత?

202223రూ.87,416 కోట్లు
202324 రూ.2.10 లక్షల కోట్లు
202425 రూ.2.69 లక్షల కోట్లు

హర్మూజ్ మూసివేత కొనసాగితే..200 డాలర్లకు ముడి చమురు

ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మూతపడటంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు ఇప్పటికే రెక్కలొచ్చాయి. ఒకవేళ పరిస్థితి మరింత దిగజారితే బ్యారెల్ ముడి చమురు ధర 200 డాలర్లకు చేరుకుంటుందని డేటా అనలటిక్స్ సంస్థ ఉడ్ మెకెంజీ పేర్కొంది. అదే జరిగితే ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక మాంద్యానికి దారితీయవచ్చని ఈ నివేదిక హెచ్చరించింది.ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం కారణంగా ఇప్పటికే ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెంపు భయాలు నెలకొన్నాయి. ప్రస్తుతం గల్ఫ్ దేశాల నుంచి వచ్చే 11 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా నిలిచిపోయింది. ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాలో 20 శాతానికి సమానమైన 80 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరాలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.అయితే, హర్మూజ్ తెరుచుకోవడంపై అంతర్జాతీయ ఆయిల్, గ్యాస్, ధరలు, ఇంధన డిమాండ్లు ఆధారపడి ఉంటాయని ఉడ్ మెకంజీ పేర్కొంది. జూన్ నాటికి సమస్య తగ్గితే 2026 చివరినాటికి బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్లకు, వచ్చే ఏడాదికి 65 డాలర్లకు తగ్గుతుందని అంచనా వేసింది. చర్చలు వేసవి చివరివరకు (అక్టోబర్) ఈ మార్గం మూతపడితే 2026 ద్వితీయార్థంలో ప్రపంచ వ్యాప్తంగా స్వల్ప ఆర్థిక మాంద్యం రావొచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది చివరివరకు హర్మూజ్ మూతపడితే క్రూడాయిల్ 200 డాలర్ల మార్కును తాకుతుందని అంచనా వేసింది. దీనివల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ 0.4 శాతం క్షీణించొచ్చని పేర్కొంది. ఈ సంక్షోభం సుదీర్ఘ కాలం కొనసాగడం వల్ల ఆసియా, యూరప్ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లే అవకాశం ఉందని, అమెరికా ఎల్ఎన్‌జీకి డిమాండ్ పెరగొచ్చని ఉడ్ మెకంజీ అంచనా వేసింది.

2008 నాటి మాంద్యం ముప్పు.....

హర్మూజ్ మూసివేత ఆగస్టు వరకు కొనసాగితే ప్రపంచ ఆర్థికవ్యవస్థ 2008 నాటి ఆర్థికమాంద్యం పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ రాపిడాన్ ఎనర్జీ గ్రూప్ పేర్కొంది. ఆగస్టు లేదా అంతకంటే ఎక్కువ కాలం మూసివేస్తే.. మార్కెట్లో రోజుకు దాదాపు 6 మిలియన్ బ్యారెళ్ల చమురు కొరత ఏర్పడుతుందని, తద్వారా ప్రపంచ వ్యాప్తంగా చమురు వినియోగం భారీగా పడిపోయే ప్రమాదం ఉందని తెలిపింది. చమురు ధరల పెరుగుదల వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి, వృద్ధి మందగించే ముప్పు పొంచిఉందని తెలిపింది. అయితే, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు 1970 లేదా 2008 నాటి కంటే కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, చమురు ధరలు నిరంతరం పెరిగితే మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొంది.

రూపాయి విలువ తగ్గనీయండి: అరవింద్ పనగారియా

అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో రూపాయి విలువ రోజురోజుకు పతనమవుతోంది. ఈ క్రమంలోనే నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా (Arvind Panagariya).. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI)కు కీలక సూచనలు చేశారు. చమురు కొరత స్వల్పకాలికమైనా.. దీర్ఘకాలికమైనా రూపాయి విలువ తగ్గాల్సిందేనన్నారు. డాలర్‌కు రూ.100 అనేది కేవలం మానసిక భావనే అని పేర్కొన్నారు. చమురు దిగుమతులు తగ్గగానే తిరిగి రూపాయి పుంజుకుంటుందని పేర్కొన్నారు. రూపాయి విలువ తగ్గితే దిగుమతులకు అయ్యే ఖర్చు పెరిగినప్పటికీ.. విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుందని వెల్లడించారు. తద్వారా రూపాయి విలువ తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేయొచ్చని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రస్తుత చమురు కొరత కొన్ని నెలల నుంచి ఒక ఏడాది వరకు కొనసాగితే రూపాయి మొదట్లో బలహీనపడుతుందని.. కానీ పెట్టుబడిదారులు పెరగడం వల్ల భవిష్యత్తులో గణనీయంగా కోలుకుంటుందని అరవింద్ పనగారియా పేర్కొన్నారు. ఈ చమురు సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే.. భారత విదేశీ మారక నిల్వలను హరించివేస్తుందని హెచ్చరించారు.

రూపాయి విలువ తగ్గింపు తప్ప మరే ఇతర మార్గాన్ని అనుసరించినా అది నష్టానికే దారితీస్తుందని తెలిపారు. ఈ సమయంలో డాలర్లలో జారీ చేసిన సావరిన్ బాండ్లు లేదా అధిక వడ్డీ ఇచ్చే ఎన్నారై డాలర్ డిపాజిట్లపై ఎక్కువగా ఆధారపడకూడదని ఆర్‌బీఐకి సూచించారు. వాటిని తాత్కాలిక, ఖరీదైన చర్యలుగా అభివర్ణించారు.2013 నాటి కరెన్సీ సంక్షోభంతో పోలిస్తే.. నేడు భారతదేశ స్థూల ఆర్థిక పరిస్థితి చాలా బలంగా ఉందని పనగారియా పేర్కొన్నారు. 2013లో ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం ఆర్‌బీఐ చేపడుతున్న మెరుగైన ద్రవ్య నిర్వహణ చర్యల వల్ల ద్రవ్యోల్బణ స్థాయిలు అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు.

శాంతి ఒప్పందంపై ఆశలు.. లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్లు లాభపడ్డాయి. దేశీయంగా రూపాయి విలువ బలపడడం, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఓ దశలో 600 పాయింట్లకు పైగా లాభాల్లో ట్రేడైన సెన్సెక్స్.. చివరికి మోస్తరు లాభాలకే పరిమితమైంది. నిఫ్టీ 23,700 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 75,260.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,183.36) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,810.97 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 231.99 పాయింట్ల లాభంతో 75,415.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 64.60 పాయింట్ల లాభంతో 23,719.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 63 పైసలు బలపడి 95.73కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, ఐటీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 105.07 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4532 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

'సలార్ 2' సెట్స్ పైకి అప్పుడే!

ప్రస్తుతం ప్రభాస్ చేతిలో మూడు సినిమాలున్నాయి. వీటిలో 'ఫౌజీ' ముగింపు దశలో ఉండగా.. 'స్పిరిట్', 'కల్కి..' సీక్వెల్ చిత్రాలు ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్నాయి. దీనితో పాటు 'సలార్ 2' చేయాల్సి ఉండగా.. ఇది ఉంటుందా అనే దానిపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఇక ఇటీవల దర్శకుడు ప్రశాంత్ నీల్ తాను త్వరలో ఓ మైథలాజికల్ సినిమా చేస్తానని చెప్పడంతో 'సలార్' సీక్వెల్ ఉండకపొవచ్చేమోనన్న ప్రచారం మరింత ఊపందుకుంది. దీంతో ఈ అంశంపై దర్శకుడు ప్రశాంత్ స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం తాను ఎన్టీఆర్‌తో చేస్తున్న 'డ్రాగన్' పూర్తి కాగానే.. 'సలార్ 2' ప్రారంభమవుతుందని వెల్లడించారు. దీంతో ఇదిప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ప్రస్తుతం ప్రశాంత్ ఎన్టీఆర్ కలయికలో వస్తున్న 'డ్రాగన్' సినిమా వచ్చే ఏడాది ఆరంభం కల్లా పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. ఈలోగా ప్రభాస్ కూడా 'ఫౌజీ'తో పాటు 'స్పిరిట్'ని ముగించే అవకాశముంది. కాబట్టి 'సలార్ 2: శౌర్యాంగపర్వం' 2027 చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లొచ్చని సంకేతాలందుతున్నాయి.



ఒట్టు... నేను రహస్యంగా పెళ్లి ... చేసుకోను!

నేను రహస్యంగా పెళ్లి చేసుకోను... ఇది నా ప్రామిస్ అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగన. ఇటీవలే ఆమె 'క్వీన్' చిత్ర సీక్వెల్ కోసం రంగంలోకి దిగారని సన్నిహిత వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆమె వివాహిత మహిళ లుక్‌లో హడావుడిగా కారు ఎక్కుతున్న ఓ వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. దీంతో కంగనా రహస్యంగా పెళ్లి చేసుకున్నారా? అంటూ సోషల్ మీడియాలో చర్చమొదలైంది . దీంతో కంగన తనదైనశైలిలో దీనికి సంబంధించి ఇన్‌స్టా సోరీలో బదులిచ్చారు."నేను చేస్తున్న క్యారెక్టర్ మేకప్‌లో ఉన్నప్పుడే ఎవరో నా ఫొటోను తీశారు. ఇప్పుడు నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. కానీ, పెళ్లి చేసుకున్న మహిళగా కనిపించడంలో అంత పెద్ద విషయం ఏముంది? సినిమాల్లో నటీనటులు అన్ని రకాల పాత్రలు పోషిస్తారు. నేనేమి రహస్యంగా పెళ్లి చేసుకోను, ఇది నా ప్రామిస్" అని రాసుకొచ్చారు. కంగనా 'క్వీన్' మొదటి చిత్రంలో వివాహం రద్దయి విదేశాలకు వెళ్లిన మహిళగా కనిపించారు. ఇప్పుడు వైరల్ అయిన వీడియోతో ఆమె సీక్వెల్‌లో వివాహిత స్త్రీగా కనిపించి ప్రేక్షకుల్ని అలరించనున్నారని తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ కంగనా పాత్ర గురించి పూర్తి వివరాలు తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి ఉండాల్సిందే. కంగనా తదుపరి 'భారత భాగ్య విధాత' అనే చిత్రంతో వచ్చే నెల 12న ప్రేక్షకుల్ని పలకరించనున్నారు.

అందాల ఐశ్వర్యం

గత కొన్నేళ్లుగా వరుసగా కేన్స్ చిత్రోత్సవాల్లో అందాల తార ఐశ్వర్యరాయ్ తళుక్కుమంటుంది. ఈ సారి ఆమె మెరుపులు ఉండవేమో అనుకున్నారు. కానీ 79వ కేన్స్ వేడుక చివరి రోజున నీలి రంగు దుస్తుల్లో అదరగొట్టేసింది ఐష్. ఆకట్టుకునే డ్రెస్‌లో ఆమె రెడ్‌కార్పెట్‌పై నడిచి అలరించింది. కెమెరా క్లిక్కుల మధ్య హొయలొలికించి ఆమె అభిమానుల్ని ఫిదా చేశారు. ఇప్పటివరకూ పలువురు భారతీయ భామలు ఈ ఏడాది వేడుకలో సందడి చేసినా ఐశ్వర్య రాకతో అది మరింత కాంతిమంతంగా మారిందంటూ నెటిజన్లు స్పందించారు.

ప్రశాంత్ నీల్ 'ఫ్యామిలీ స్టోరీ'.. అందుకే ఆగిపోయింది!

ప్రశాంత్‌నీల్ (Prashanth Neel) సినిమాలనగానే పవర్‌ఫుల్ క్యారెక్టర్లు, హై ఓల్టేజ్ ఎలివేషన్లు గుర్తొస్తాయి. పైగా ఆయన చిత్రాల్లో నలుపు రంగే దర్శనమిస్తూ ఉంటుంది. మరి, ఇలాంటి దర్శకుడు.. కలర్‌ఫుల్‌గా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తీస్తే ఎలా ఉంటుంది? వాస్తవానికి ఆయన రెండో సినిమా అదే కావాల్సింది. కానీ, ఆ స్థానంలో 'కేజీయఫ్' (KGF) వచ్చింది. తాను రాసుకున్న కుటుంబ కథను భవిష్యత్తులోనైనా ప్రశాంత్‌నీల్ తెరకెక్కిస్తారా? అంటే లేదు అని సమాధానం ఇచ్చారు దర్శకుడు. దానికి గల కారణాన్నీ వివరించారు. అది పునీత్ రాజ్‌కుమార్ (Puneeth Rajkumar) కోసమే రాసిన కథ అని, ఆయన ఇప్పుడు లేరు కాబట్టి ఆ స్టోరీని పట్టాలెక్కించే ఆలోచన లేదన్నారు. ముందుగా ఫ్యామిలీ స్టోరీతోనే హోంబలే ఫిల్మ్స్ నిర్మాణ సంస్థను సంప్రదించారు ప్రశాంత్‌నీల్. అయితే, సదరు సంస్థ ఫ్యామిలీ మూవీకి బదులు యాక్షన్ చిత్రమైతే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేయగా.. ఓ పవర్‌ఫుల్ సీన్‌ను వినిపించారు నీల్. అది ప్రొడ్యూసర్‌కు బాగా నచ్చడంతో.. తర్వాత పూర్తి కథను సిద్ధం చేశారు. అదే 'కేజీయఫ్'. యశ్ హీరోగా.. రెండు భాగాలుగా వచ్చిన ఈ స్టోరీ ఎంత సెన్సేషన్ అయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా. 'కేజీయఫ్'ను తెరకెక్కించడంతో.. ఆ కుటుంబ కథ వాయిదా పడింది. గుండెపోటుతో పునీత్ రాజ్‌కుమార్ 2021లో మరణించిన సంగతి తెలిసిందే.

'పెద్ది' ఐటెం సాంగ్ రాయడానికి 50 రోజులు పట్టింది: అనంత శ్రీరామ్



ప్రస్తుతం 'పెద్ది' సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాలోని ఐటెం సాంగ్ గురించి గేయ రచయిత అనంత శ్రీరామ్ (Ananth Sriram) ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

''తెలుగులో ఏఆర్ రెహమాన్‌కు నేను 30 పాటలు రాశాను. ప్రతి పాట కొత్తగానే అందించాను. ప్రయోగాలకు ఆయన ఎప్పుడూ పెద్దపీట వేస్తారు. 'పెద్ది'లో ఐటెం సాంగ్ అదిరిపోతుంది. ఆ పాట రాయడానికి నాకు 50 రోజుల సమయం పట్టింది. రెహమాన్ బాణీల్లో ఇప్పటివరకూ వచ్చినదాని కంటే కొత్త తరహా ప్రయోగం చేశారు. ఐటెం సాంగ్‌కూ ఇలాంటి బాణీలు ఇవ్వొచ్చా? అని మేం ఆశ్చర్యపోయాం. ఆ ట్యూన్ వింటూనే 5 రోజులు గడిపేశాం. తర్వాత లిరిక్స్ కూడా ఇద్దరు మనుషులు మాట్లాడుకుంటున్నట్లుగా రాశాను. ఇక 'పెద్ది'లో 'రైరా రారా' పాట విని చిరంజీవి ఫోన్ చేశారు. 'నా జీవితాన్ని నేను చూసుకున్నట్లు ఉంది. పూర్తిగా నేను ఆలోచించే ఫిలాసఫీని ఇప్పటి కాలానికి తగినట్లు అందించావు' అని చిరంజీవి అనడం నా జీవితంలో మర్చిపోలేని ప్రశంస'' అని అనంత శ్రీరామ్ తెలిపారు.

పెద్ది (Peddi) ఐటెం సాంగ్ మే 23న విడుదల చేయనున్నారు. దీని కోసం భోపాల్‌లో గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్ ఏర్పాటు చేసి అందులో ఈ పాటను ప్రదర్శించనున్నారు. ఈ వేడుకకు ముందు.. 'పెద్ది' టీమ్ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలవనుంది.

ఆదర్శకుటుంబంలోకి నివేద!

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం 47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీనిధి శెట్టి కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాలోకి కొత్తగా మరో అందం చేరినట్లు తెలుస్తోంది. నటి నివేదా పేతురాజ్ ఇందులో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇది త్రివిక్రమ్‌తో ఆమెకి రెండో సినిమా. తను గతంలో ఆయన దర్శకత్వంలో 'అల.. వైకుంఠపురములో' సినిమాలోనూ ముఖ్య పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుతం తుది దశ చిత్రీకరణలో ఉన్న ఈ 'ఆదర్శ కుటుంబం' అక్టోబరులో తెరపైకి వచ్చే అవకాశముందని ప్రచారం వినిపిస్తోంది. ఇది కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోంది.

పోలీసులకు అనసూయ, విష్ణుప్రియ ఫిర్యాదులు

టాలీవుడ్ సెలబ్రిటీలు అనసూయ (Anasuya), విష్ణుప్రియ (Vishnu Priya) పోలీసులకు వేర్వేరుగా శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఒకరు నేరుగా స్టేషన్‌కెళ్లి కంప్లైట్ చేయగా.. మరొకరు సోషల్ మీడియా వేదికగా ట్యాగ్ చేశారు. ఏం జరిగిందంటే?తన గురించి తప్పుడు ప్రచారం చేస్తోందంటూ ఓ యూట్యూబ్ ఛానల్‌పై మియాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు విష్ణుప్రియ. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ''ఆమె కూడా ఓ అమ్మాయి (విష్ణుప్రియ గురించి మాట్లాడిన అమ్మాయి). అయినా, ఇండస్ట్రీకి చెందిన మహిళల గురించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతోంది. ఆమెపై చర్యలు తీసుకోవాలనుకున్నా. అందులో భాగంగానే కంప్లైట్ ఇచ్చా. ఆమే కాదు ఇలా చాలామంది ఉన్నారు. వారిపైనా యాక్షన్ తీసుకుంటా'' అని హెచ్చరించారు.తనను అసభ్యకర రీతిలో చూపిస్తూ ఏఐ ఫొటోలను సృష్టిస్తున్నారంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను ఎక్స్ వేదికగా ట్యాగ్ చేశారు అనసూయ. ''సర్.. ఇలాంటి వాటిని పట్టించుకోకుండా ఉండాలని ప్రయత్నించా. కానీ, ఈ ప్రొఫైల్‌లో తరచూ.. నా ఏఐ జనరేటెడ్ ఇమేజ్‌లను పోస్టు చేస్తున్నారు'' అంటూ సంబంధిత ఎక్స్ హ్యాండిల్ వివరాలను సజ్జనార్ ఖాతాను ట్యాగ్ చేశారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి.. హైదరాబాద్ సైబర్‌క్రైమ్ బ్రాంచ్‌ను సంప్రదించి, ఫిర్యాదు చేయమని సూచించారు. సమన్వయం చేసుకోవాలంటూ 'హైదరాబాద్ సిటీ పోలీస్' ఖాతాను ట్యాగ్ చేశారు. ఈ క్రమంలో కొందరు విమర్శిస్తూ పోస్టులు పెట్టగా.. తనదైన శైలిలో సమాధానాలిచ్చారు అనసూయ.

వినేశ్ విజయం కనిపించలేదా!

దిల్లీ: సీనియర్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు ఊరట లభించింది. దేశవాళీ ఈవెంట్లలో పోటీ పడడానికి ఆమెకు అర్హత లేదని తీసుకున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) నిర్ణయాన్ని దిల్లీ హైకోర్టు తప్పుపట్టింది. ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్‌లో వినేశ్ పాల్గొనేందుకు నిబంధనలు అంగీకరించవని డబ్ల్యూఎఫ్ఐ పేర్కొనగా.. తామే తగిన ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఆమెను ఇబ్బంది పెట్టడానికి ఉద్దేశపూర్వకంగానే సమాఖ్య నిబంధనలు మార్చారా అని ప్రశ్నించింది. భారత్‌లో అమృతాన్ని సంబరంలా చేసుకుంటారని, అలాంటిది బిడ్డకు జన్మనిచ్చిన కారణంగా వినేశ్‌ను పక్కన పెట్టాలనుకోవడం, ఆమెపై ప్రతీకార చర్యలకు పూనుకోవడం సరికాదని కోర్టు తెలిపింది. క్రీడల భవిష్యత్తుకు ఇది శ్రేయస్కరం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. మే 9న వినేశ్‌కు డబ్ల్యూఎఫ్ఐ జారీ చేసిన షోకాజ్ నోటీసులో.. అధిక బరువుతో పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో వినేశ్ అనర్హతకు గురికావడాన్ని దేశానికి అవమానం అని వ్యాఖ్యానించడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమె ఫైనల్‌కు చేరడాన్ని దేశం ఎంత గొప్పగా చూసిందో తెలియదా.. అలాంటి ఘనతను దేశానికి అవమానమని ఎలా అంటారని మండిపడింది. ప్రభుత్వం తరపు న్యాయవాది మాట్లాడుతూ.. వినేశ్ ఈ సెలక్షన్ ట్రయల్స్ విజయం సాధిస్తే ఆసియా గేమ్స్‌లో తలపడడానికి అర్హత ప్రమాణాల సడలింపు ఉంటుందన్నారు.

భారీ విజయం సాధించినా సన్‌రైజర్స్‌కు నిరాశే

పాపం సన్‌రైజర్స్ హైదరాబాద్.. కొండంత స్కోరు చేసింది.. అద్భుత ఫామ్‌లో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును మట్టికరిపించింది.. కానీ అనుకున్నది మాత్రం దక్కలేదు. క్వాలిఫయర్ 1 బెర్తును కొద్దిలో చేజార్చుకున్న సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్‌లో భాగంగా ఎలిమినేటర్ ఆడకతప్పదు. పట్టికలో బెంగళూరు, గుజరాత్, సన్‌రైజర్స్ 18 పాయింట్లతో సమానంగా నిలిచినా.. రన్‌రేట్‌లో మెరుగ్గా ఉన్న బెంగళూరు అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్‌తో ఆ జట్టు 26న క్వాలిఫయర్ ఆడుతుంది. ప్లేఆఫ్స్‌లో నాలుగో బెర్తు సొంతం చేసుకునే జట్టుతో 27న సన్‌రైజర్స్ ఎలిమినేటర్‌లో తలపడుతుంది.

గెలిచినా సన్‌రైజర్స్‌లో ఆనందం లేదు! ఓడినా బెంగళూరుదే సంబరం! శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ అనంతరం దృశ్యాలివీ! మ్యాచ్‌లో గెలిచే అవకాశం లేదని భావించిన బెంగళూరు జాగ్రత్తగా ఆడి క్వాలిఫయర్ 1లో నిలిచేందుకు అవసరమైన రన్‌రేట్‌ను సాధించింది. కానీ ఆ జట్టు 55 పరుగుల తేడాతో ఓడింది. తొలుత సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. అభిషేక్‌శర్మ (56; 22 బంతుల్లో 4×4, 5×6), ఇషాన్ కిషన్ (79; 46 బంతుల్లో 8×4, 3×6), హెన్రిచ్ క్లాసెన్ (51; 24 బంతుల్లో 2×4, 5×6), నితీశ్‌కుమార్ (29 నాటౌట్; 12 బంతుల్లో 1×4, 3×6) చెలరేగారు. బెంగళూరు 20 ఓవర్లలో 200 (4 వికెట్లకు) పరుగులకు పరిమితమైంది. వెంకటేశ్ అయ్యర్ (44; 19 బంతుల్లో 4×4, 4×6), కెప్టెన్ రజత్ పాటీదార్ (56; 39 బంతుల్లో 6×4, 1×6), కృనాల్ పాండ్య (41 నాటౌట్; 31 బంతుల్లో 5×4) బెంగళూరుకు కావాల్సిన రన్‌రేట్ అందించడంలో విజయవంతమయ్యారు. ఎవరి లక్ష్యం వారిది: లక్ష్యం 256 పరుగులే అయినా.. ఇరు జట్లూ రెండు సొంత టార్గెట్‌లతో బరిలో దిగాయి. 166 పరుగులలోపు బెంగళూరును కట్టడి చేస్తే.. టాప్2లో అడుగుపెట్టొచ్చన్నది సన్‌రైజర్స్ ఆశ. అప్పుడు బెంగళూరు మూడో స్థానానికి పడిపోతుంది. 178 పరుగులు సాధిస్తే బెంగళూరు పాయింట్ల పట్టికలో నంబర్‌వన్‌గానే కొనసాగుతుంది. అయితే సన్‌రైజర్స్ ఆశలపై నీళ్లు చల్లుతూ ఆరంభంలో వెంకటేశ్ అయ్యర్ ఎదురుదాడికి దిగాడు. కమిన్స్ తొలి ఓవర్లో సిక్సర్, బౌండరీతో మొదలుపెట్టిన అతను.. శివాంగ్ కుమార్ బౌలింగ్‌లో విధ్వంసం సృష్టించాడు. మూడు సిక్సర్లు, ఒక బౌండరీతో 23 పరుగులు పిండుకున్నాడు. దీంతో 3.4 ఓవర్లలోనే బెంగళూరు స్కోరు 50 దాటింది. ఇషాన్ మలింగ షార్ట్ పిచ్ బంతికి వెంకటేశ్.. సాకిబ్ హుస్సేన్ ఓవర్లో విరాట్ కోహ్లి (15) వెంటవెంటనే ఔటవడంతో బెంగళూరు వేగానికి బ్రేకులు పడ్డాయి. ఓపెనర్ల వికెట్లు కోల్పోయినా.. 75/2తో పవర్ ప్లేను బెంగళూరు గౌరవప్రదంగానే ముగించింది. అయితే సన్‌రైజర్స్ క్రమశిక్షణతో బౌలింగ్ చేయడంతో బెంగళూరు బ్యాటర్లకు పరుగులు రాబట్టడం కష్టమైంది. పవర్ ప్లే తర్వాతి 4 ఓవర్ల (24 బంతుల్లో) లో బెంగళూరుకు 25 పరుగులే వచ్చాయి. ఇన్నింగ్స్ అర్ధభాగం ముగిసేసరికి (10 ఓవర్లు) బెంగళూరు స్కోరు 100/3. విజయం సాధించడం కష్టమని భావించిన బెంగళూరు 178 లక్ష్యంగా కదిలింది. రజత్ పాటీదార్, కృనాల్ పాండ్య అనవసర షాట్లకు పోలేదు. సింగిల్స్ తీసుకుంటూ.. చెత్త బంతిని బౌండరీకి తరలిస్తూ నిదానంగా బ్యాటింగ్ చేశారు. 16.4 ఓవర్ల వద్ద బెంగళూరు 166 స్కోరు అందుకోవడంతో పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్ రెండో స్థానం ఆశలు గల్లంతయ్యాయి. మరో 9 బంతులాడి 178 స్కోరుకు చేరుకున్న బెంగళూరు నంబర్‌వన్ స్థానాన్ని పదిలం చేసుకుంది. చివర్లో కృనాల్ వేగంగా ఆడటంతో బెంగళూరు 200 అందుకుంది. దంచుడే దంచుడు: బెంగళూరును భారీ తేడాతో ఓడించి క్వాలిఫయర్ 1కు అర్హత సాధించాలన్న లక్ష్యంతో బరిలో దిగిన సన్‌రైజర్స్.. టాస్ గెలవగానే మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకుంది. కెప్టెన్ కమిన్స్ నమ్మకాన్ని ఓపెనర్లు నిలబెట్టారు. అభిషేక్, ట్రావిస్ హెడ్ (26; 16 బంతుల్లో 5×4) అదిరే ఆరంభాన్నిచ్చారు. భువనేశ్వర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే హెడ్ బౌండరీ, అభిషేక్ సిక్సర్‌తో మొదలైన పరుగుల ప్రవాహం చివరి వరకు భీకరంగా కొనసాగింది.

హెడ్‌ను రసిఖ్ దార్ యార్కర్‌తో బోల్తాకొట్టించినా.. అభిషేక్ మాత్రం వెనక్కి తగ్గలేదు. రెండు సార్లు (25, 39) ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడిన అతడు కేవలం 20 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. ప్రమాదకరంగా మారిన అభిషేక్.. సుయాశ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగాఫ్‌లో జోర్దాన్‌కు చిక్కాడు. క్రీజులోకి ఎవరొచ్చినా బంతిని బౌండరీకి పంపాలన్న కసితో బ్యాటింగ్ చేయడంతో సన్‌రైజర్స్ 8.5 ఓవర్లలో 100 పరుగులు దాటింది. 10 ఓవర్లకు 116/2తో ఉన్న హైదరాబాద్ ఆ తర్వాత మరింత రెచ్చిపోయి ఆడింది. అద్భుత ఫామ్‌లో ఉన్న ఇషాన్ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఆరంభంలో కాస్త ఇబ్బందిపడ్డ క్లాసెన్.. హేజిల్‌వుడ్ వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్లో బంతిని పదేపదే ప్రేక్షకుల వద్దకు పంపాడు. మూడు సిక్సర్లు, ఒక బౌండరీ సహా ఆ ఓవర్లో 27 పరుగులు రావడంతో ఇన్నింగ్స్ జెట్‌స్పీడ్ అందుకుంది. సన్‌రైజర్స్ 15.2 ఓవర్లలో 200 పరుగుల మైలురాయిని అధిగమించింది. ఈ క్రమంలోనే ఇషాన్ 31.. క్లాసెన్ 23 బంతుల్లోనే అర్ధ సెంచరీలు సాధించారు. మూడో వికెట్‌కు 113 పరుగుల (48 బంతుల్లో) భాగస్వామ్యంతో మ్యాచ్ దిశను మార్చిన వీరిద్దరి జోడీని కృనాల్ విడదీశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నితీశ్ తాను ఎదుర్కొన్న తొలి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. నితీశ్, ఇషాన్ విరుచుకుపడటంతో 19.3 ఓవర్లలో సన్‌రైజర్స్ స్కోరు 250 దాటింది. ఆఖరి బంతికి ఇషాన్ ఔటైనా అప్పటికే సన్‌రైజర్స్ ఈ సీజన్‌లో మూడో అత్యుత్తమ స్కోరు (255) సాధించింది.

ముగ్గురు మొనగాళ్లు..

బెంగళూరుపై 79 పరుగులు చేసిన ఇషాన్ కిషన్ (569) ఈ సీజన్‌లో 500కుపైగా పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో చేరాడు. సన్‌రైజర్స్ జట్టులో ఇప్పటికే క్లాసెన్ (606), అభిషేక్ (563) ఆ జాబితాలో ఉన్నారు. ఓ సీజన్‌లో ఒక జట్టు నుంచి ముగ్గురు బ్యాటర్లు 500కుపైగా పరుగులు చేయడం ఇది రెండోసారి మాత్రమే. 2025లో గుజరాత్ తరపున శుభ్‌మన్, సాయి సుదర్శన్, బట్లర్ ఈ ఘనత అందుకున్నారు.

255

మ్యాచ్‌లో సన్‌రైజర్స్ చేసిన పరుగులు. ఈ సీజన్‌లో మూడో అత్యధిక స్కోరు ఇది. పంజాబ్ కింగ్స్ (265), దిల్లీ క్యాపిటల్స్ (264) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

స్కోరు వివరాలు

గుహైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) కాక్స్ (బి) సుయాశ్ 56; హెడ్ (బి) రసిఖ్ 26; ఇషాన్ కిషన్ (సి) పడిక్కల్ (బి) రసిఖ్ 79; క్లాసెన్ (సి) వెంకటేశ్ (బి) కృనాల్ 51; నితీశ్ 29 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 255; వికెట్ల పతనం: 1-45, 2-97, 3-210, 4-255; బౌలింగ్: భువనేశ్వర్ 4-0-51-0; హేజిల్‌వుడ్ 4-0-55-0; రసిఖ్ దార్ 4-0-52-2; సుయాశ్ శర్మ 3-0-36-1; రొమారియో షెఫర్డ్ 3-0-37-0; కృనాల్ పాండ్య 2-0-24-1

బెంగళూరు ఇన్నింగ్స్: వెంకటేశ్ (సి) అభిషేక్ (బి) మలింగ 44; కోహ్లి (సి) స్మరణ్ (బి) సాకిబ్ 15; పడిక్కల్ (సి) అభిషేక్ (బి) మలింగ 21; పాటీదార్ (సి) స్మరణ్ (బి) హెడ్ 56; కృనాల్ నాటౌట్ 41; డేవిడ్ నాటౌట్ 15; ఎక్స్‌ట్రాలు 8, మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 200; వికెట్ల పతనం: 1-60, 2-74, 3-94, 4-178; బౌలింగ్: కమిన్స్ 4-0-48-0; మలింగ 4-0-33-2; శివాంగ్ 2-0-32-0; సాకిబ్ 4-0-31-1; హర్షల్ 4-0-37-0; నితీశ్ 1-0-10-0; హెడ్ 1-0-7-1

అనిమేశ్‌దే జాతీయ రికార్డు

రాంచి: జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల్లో జాతీయ రికార్డు నిమిషాల వ్యవధిలోనే రెండు సార్లు బద్దలైంది. శుక్రవారం పురుషుల వంద మీటర్ల సెమీస్ తొలి హీట్‌లో అనిమేశ్ కుజుర్ పేరిట ఉన్న జాతీయ రికార్డు (10.18 సెకన్లు)ను గుర్విందర్‌వీర్ సింగ్ (10.17) బ్రేక్ చేశాడు. కొద్దిసేపటికే సెమీస్ రెండో హీట్‌లో అనిమేశ్ 10.15 సెకన్లలోనే పరుగు పూర్తి చేసి తిరిగి జాతీయ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో అతడు 2026 కామన్వెల్త్ క్రీడల అర్హత ప్రమాణాన్ని కూడా అందుకున్నాడు. శనివారం ఫైనల్ జరగనుంది. లాంగ్‌జంప్ మహిళల విభాగంలో గత ఏడాది శైలి సింగ్ (6.64 మీటర్లు) నెలకొల్పిన రికార్డును యాన్సీ సోజాన్ (6.75) బద్దలుకొట్టింది. శైలి (6.47) రెండో స్థానానికి పరిమితమైంది.



వైభవ్ ఎఫెక్ట్.. బిహార్‌కీ ఉండాలి ఒక ఐపీఎల్ టీమ్!.

ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ (Vaibhav Sooryavanshi In IPL) రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాడు. బిహార్‌కు చెందిన ఈ 15 ఏళ్ల కుర్రాడు సంచలన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. ఇలాంటి ఆటగాడు వచ్చిన బిహార్‌కూ ఓ ఐపీఎల్ జట్టు ఉండాలని బిలియనీర్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. భారత్‌లోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన వేదాంతా గ్రూప్‌నకు ఆయన ఛైర్మన్. పట్నాలో 1954లో ఆయన జన్మించారు. సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టు వైరల్‌గా మారింది. బిహార్ నుంచి అద్భుతమైన క్రికెటర్లు వస్తున్నారని అందులో పేర్కొన్నారు.

ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మాదిరిగా బిహార్ కూడా అద్భుతమైన జట్టును కలిగి ఉండటానికి అర్హత ఉందని మీకు అనిపించడం లేదా? బిహార్ గడ్డ ఎంతో మంది నాణ్యమైన క్రికెటర్లను దేశానికి అందించింది. పట్నాలో జన్మించిన ఇషాన్ కిషన్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించాడు. సమస్తిపుర్ నుంచి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ అరంగేట్రంలోనే రికార్డులు సృష్టించాడు. సకిబ్ హుస్సేన్ (ఎస్ఆర్‌హెచ్) గోపాల్‌గంజ్‌లోని ఓ సాధారణ కుటుంబానికి చెందిన ప్లేయర్. ఇలాంటివన్నీ చూసినప్పుడు నాకు ఒకటే అనిపించేది. ఎందుకు క్రికెట్‌లో బిహార్‌కు గుర్తింపు రావడం లేదు? బిహార్ యువత ప్రతి రంగంలోనూ రాణించేలా అవకాశాలు కల్పించడం. మన క్రీడాకారులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అందించేలా చేయడం నా చిరకాల స్వప్నం. బిహార్ నుంచి వచ్చే జట్టు ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందన్న పూర్తి విశ్వాసం నాకుంది'' అని అనిల్ అగర్వాల్ పోస్టు పెట్టారు.

కొత్తవి వస్తాయా?

నాలుగేళ్ల కిందట రెండు ఫ్రాంచైజీలు అదనంగా వచ్చిన సంగతి తెలిసిందే. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ అడుగు పెట్టాయి. ఇప్పటికే ఐపీఎల్ మార్కెట్ విలువ భారీగా ఉంది. దీంతో కొత్త ఫ్రాంచైజీలకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఒకటి, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి ఒక ఫ్రాంచైజీకి అనుమతి ఇవ్వాలని పలువురు కోరారు. ఇప్పుడు బిహార్‌కు చెందిన బిలియనీర్ నేరుగా రంగంలోకి దిగడంతో ఐపీఎల్ మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

ఫ్రెంచ్ ఓపెన్లో మాయ

పారిస్: భారత యువ కెరటం మాయ రాజేశ్వరన్ రేవతి ఫ్రెంచ్ ఓపెన్ జూనియర్ విభాగంలో పోటీపడబోతోంది. గత కొంతకాలంగా స్థిరంగా రాణిస్తున్న 16 ఏళ్ల రేవతి.. బాలికల సింగిల్స్ బరిలో నిలిచింది. ఈ సీజన్లో ఏడు క్లే కోర్టు టోర్నీల్లో ఆడి రెండింట్లో సెమీఫైనల్ చేరిన మాయ జోరు మీద ఉంది. గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడడం మాయకు కొత్తేం కాదు. 2025లో యుఎస్ ఓపెన్, 2026లో ఆస్ట్రేలియన్ ఓపెన్ జూనియర్ విభాగంలో ఆమె బరిలోకి దిగింది. భారత మహిళా టెన్నిస్‌లో సింగిల్స్‌లో భవిష్యత్ తారగా పేరు తెచ్చుకున్న మాయ.. ప్రస్తుతం జూనియర్ ర్యాంకింగ్స్‌లో 27వ ర్యాంకులో ఉంది. మరోవైపు ఆదివారం ఆరంభం కాబోతున్న ఫ్రెంచ్ ఓపెన్ డ్రా ఇప్పటికే విడుదలైంది. కెరీర్ చరమాంకంలో ఉన్న సెర్బియా దిగ్గజ ఆటగాడు నొవాక్ జకోవిచ్ ఈ టోర్నీ బరిలో ఉన్నాడు. డ్రాలో జకోవిచ్, మరో స్టార్ ప్లేయర్ యానిక్ సినర్ (ఇటలీ) వేర్వేరు పార్శ్వాల్లో ఉన్నారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో పెరికార్డ్ (ఫ్రాన్స్)తో మూడో సీడ్ నొవాక్ పోటీని ప్రారంభించనున్నాడు. టాప్‌సీడ్ సినర్.. టబర్ (ఫ్రాన్స్)తో తలపడతాడు. 2025 ఫ్రెంచ్ ఓపెన్ విజేత కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) గాయంతో ఈసారి టోర్నీ నుంచి వైదొలగడంతో సినర్, జకోవిచ్ టైటిల్ ఫేవరెట్లుగా బరిలో దిగుతున్నారు. జ్వెరెవ్ (జర్మనీ) రెండు, ఫెలిక్స్ ఆగర్ (కెనడా), బెన్ షెల్టన్ (అమెరికా) నాలుగు, అయిదో సీడెడ్ ప్లేయర్లుగా ఆడుతున్నారు. వెటరన్ స్టార్లు స్టాన్ వావ్రింకా (స్విట్జర్లాండ్), మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) కెరీర్‌లో చివరి ఫ్రెంచ్ ఓపెన్ ఆడబోతున్నారు. ఈ సీజనే తమకు ఆఖరిదని వీళ్లిద్దరూ ఇప్పటికే ప్రకటించారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా, డిఫెండింగ్ ఛాంపియన్ గాఫ్ ఒకే పార్శ్వంలో ఉన్నారు. వీళ్లిద్దరూ సెమీస్‌లో ఎదురుపడే అవకాశాలున్నాయి.